

# ప్రమాదం జాగ్రత్త!

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

"పద, పోదాం" అన్నారు వాళ్ళు. మళ్ళీ రెండు సందులు తిరిగారు. అంటే ఆ గరాజి వెనక సందులోకి వెళ్ళారు. ఒక యింటి తలుపు తట్టగానే తెరుచుకుంది. ఆ నలుగురు, రాజూ లోపలికి వెళ్ళగానే తలుపు మూసేశారు. తలుపు వెనక బలాఢ్యుడయిన మనిషి నిలుచున్నాడు.

చిన్న దీపం, గది మధ్యన ఒక వుయాల బల్ల, బల్లమీద నలభయి యేళ్ళ మనిషి కూర్చునున్నాడు.

"ఏమ్రా, ఎవరో కొత్తమనిషిని తీసుకొచ్చారు, ఎవడు వీడు?" అడిగాడు.

అతనే మొదలియార్ అయ్యుండాలని రాజు గ్రహించాడు.

ఆ నలుగురు డబ్బు మొదలియార్ కిచ్చి, "ఎవరో కరుప్పనట, అతన్ని గురించి వాకబు చేస్తున్నాడు యితను. తీసుకురాక తప్పింది కాదు" అని జరిగింది చెప్పారు వాళ్ళు. మొదలియార్ రాజుని ఎగాదిగా చూసి, "కరుప్పనా! అతని విషయం నీకెందుకు?" అడిగాడు. కూడా వచ్చిన నలుగురూ వెళ్ళిపోయారు.

"నా పేరు రాజు. డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుని, ఒక కేసు విషయంలో కరుప్పన్ జాడలు తెలుసుకోవలసిన అవసరం వచ్చింది. కరుప్పన్ ఎక్కడున్నాడో చెబితే నేను వెళ్ళిపోతాను. మీరు సాగిస్తున్న ఈ దొంగసారాయి విషయం పోలీసులకి చెప్పవని నాకు ఏమిటి నమ్మకం. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన వ్యాపారం మూసుకుపోవలసి రావచ్చు. నిన్ను ప్రాణాలతో యిక్కణ్ణించి" అంటూండగానే తలుపు వెనక నిలుచున్న బలాఢ్యుడు, అంతకన్న బలమైన యింకొకడు రాజు వెనకగా వచ్చి రాజుని చెరో భుజం పట్టుకున్నారు గట్టిగా.

"మొదలియార్! మీతో తగాదా పెట్టుకోడానికి నేను యిక్కడికి రాలేదు. నాతో తగాదా పెట్టుకోవడం మంచిది కాదు. కరుప్పన్ విషయం చెప్పు. వెళ్ళిపోతా" అన్నాడు రాజు.

"కరుప్పన్ విషయం నాకు తెలియదు. తెలుసునని యెందుకనుకున్నావు?"

"తెలియకపోతే తెలియదని ముందరే చెప్పేవాడివి."

మొదలియార్ నవ్వాడు.

"నాకు చాలా పనులయ్యాయి. నీతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చోడానికి తీరికలేదు" అని తన మనుష్యులకి కళ్ళతో సంజ్ఞ చేశాడు. రాజు భుజాల్ని పట్టుకున్న వాళ్ళిద్దరూ, పట్టు మరింత బిగించి రాజుని వెనక్కి లాగారు. అలాంటిదేదో జరుగుతుందని రాజుకి ముందరే తెలుసు. అరక్షణంలో రెండు చేతులూ ముందుకి జాపి, వొంచి రెండు మోచేతులతోనూ ఆ యిద్దరిని, చెరొకరిని చెరొక

మోచేత్తో బలమంతా ప్రయోగించి పొట్ట అడుగు భాగం మీద కొట్టాడు. ఉక్కు శూలాలు గుచ్చుకున్నట్టు గుచ్చుకున్నాయి వాళ్ళకి. తగలకూడని చోట తగిలిందేమో! బాధతో మెలికలు మెలికలు తిరిగి కళ్ళు తేలవేసి యిద్దరూ కిందపడ్డారు. చెత్తకాయితాలు తోసినట్టు రాజు ఆ యిద్దరినీ కాళ్ళతో ఒక మూలకి తన్ని "మొదలియార్ కరుప్పన్ విషయం చెబుతావా? లేక నీకు కూడా" అంటున్నాడు.

బెదిరిపోయిన మొదలియార్ ఉయ్యాలమీద వున్న దిండు క్రిందకి చెయ్యిపోనిస్తున్నాడు.

"రెండు చేతులు పైకెత్తు. లేదా చస్తావు" రాజు చేతిలో పిస్తోలు చూసి మొదలియార్ రెండు చేతులు పైకెత్తాడు.

"ఇప్పుడయినా చెబుతావా?" అడిగాడు రాజు. మొదలియార్ తలవూపి "కరుప్పన్ జైలులో వున్నాడు" అన్నాడు.

"జైలులోనా? ఏ జైలులో వున్నాడు? ఏ నేరం చేశాడు? ఎప్పుడు పట్టుకున్నారు?"

"నాకు తెలిసినంతవరకు వేలూరు జైలులో వున్నాడు. తేదీ జ్ఞాపకం లేదు. ఒకరోజు కామరాజు నగరం నుంచి తప్పతాగి వస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నారు. తాగినవాళ్ళకి మూడు నెలల జైలు శిక్షగా మన రాష్ట్రంలో" అన్నాడు మొదలియార్.

"ఈ విషయం ముందే చెప్పివుంటే నాకు శ్రమా, నీకు కష్టం తప్పి వుండేది పద."

"ఎక్కడికి?" అడిగాడు మొదలియారు.

"పోలీసు స్టేషన్‌కి" పిస్తోలు పట్టుకున్న రాజు ఆజ్ఞని పరిపాలించక తప్పలేదు మొదలియార్‌కి.

## 15

తలుపు మీద మునివేళ్ళతో కొట్టింది కాత్యా.

"ఎవరూ?" అంటూ నలబయి సంవత్సరాలతను తలుపు తీశాడు.

"సింపా మెడికల్ కంపెనీ రిప్రెజెంటేటివ్‌ని. డాక్టర్ పంకజరావు వున్నారా?" అడిగింది.

"బయట బోర్డు చూడలేదూ? నా పేరు కృష్ణానాధ. అడ్వకేట్. ఈ యింట్లో డాక్టరు ఎవరూ లేరు" అన్నాడాయన.

"క్షమించండి. నా జాబితాలో, యీ యింట్లో పంకజరావున్నారని వుంది. అంతేకాదు యీ యింట్లో డాక్టరుగార్ని కలుసుకున్నాను."

"డాక్టరు యీ యిల్లు ఖాళీ చేశారు. నేను అద్దెకి వచ్చాను."

"డాక్టర్ పంకజరావుగారు ఎక్కడున్నారో తెలుసా?"

"ఐ యామ్ సారీ, తెలియదు."

"ఎవరికి తెలుస్తుంది?"

"పోస్టాఫీసులో అడిగితే తెలుస్తుందేమో?"

"కనుక్కున్నాను. పోస్టాఫీసులో కూడా తెలియలేదు. వాళ్ళకి మారిన నంబరు యివ్వలేదు."

"ఐ యామ్ సారీ, ఐ కాంట్ హెల్ప్‌యు" అన్నాడు కృష్ణానాధ విసుగ్గా. కాత్యా అక్కణ్ణించి బయలుదేరింది.

ఒక డాక్టర్, కాంపౌండర్‌తో, సామానులతో, కుటుంబంతో సహా గాలిలో కలిసిపోయి మాయమవడు, ఏదో సూచన వుంటుంది. వీధి చివర్న ఒక చిన్న మోటారు వర్కుషాపు వున్నది. కాత్యా అక్కడికి వెళ్ళింది.

"ఆ యింట్లో డాక్టర్ పంకజరావుగారుండేవారు, తెలుసా?" కార్బరేటర్ రిపేర్ చేస్తున్న మెకానిక్ "ఆ! తెలుసు" అన్నాడు.

"ఆయన యిప్పుడు ఎక్కడున్నారు? ఎక్కడికి మారారు?"

"నాకు అడ్రసు చెప్పలేదు" అన్నాడు ఆ మెకానిక్ బీడీ వెలిగిస్తూ.

"డాక్టరుకి కారుండేదా?" మెకానిక్ నవ్వాడు. "ప్రాక్టీసులేని డాక్టర్. సైకిలుండేది" అన్నాడు.

కాత్యా నవ్వి. "ఇల్లు ఖాళీ చేస్తున్నప్పుడు సామానులు దేనిలో తీసుకెళ్ళారు?" అడిగింది.

"ఏమమ్మా! ఏదో పోలీసు ఉద్యోగిలా ప్రశ్నలు అడుగుతున్నావు. నీకెందుకు?" అడిగాడు మెకానిక్. కాత్యా పది రూపాయలనోటు ఆ మెకానిక్‌కి యిచ్చి, "ఆయన నా మేనమామ. ఈ మధ్యనే మా అమ్మ పోయింది" కాస్త కళ్ళల్లో నీళ్ళు తెచ్చుకుంది.

"అలాగా, సామానులు లారీలో తీసుకుని వెళ్ళారు. అంతవరకూ చెప్పగలను."

"ఆ లారీ ఏ కంపెనీది? నెంబరు తెలుసా?"

"నెంబర్ నాకు జ్ఞాపకం లేదు. లక్ష్మీ లారీ సర్వీస్ అని వ్రాసి వుంది. ఆ లారీ డ్రయివర్ పూర్వం టాక్సీ తోలేవాడు. అప్పుడు అతను నా వర్కుషాపుకి వచ్చేవాడు. అందువల్ల జ్ఞాపకం వుంది."

"ఆ లారీ డ్రయివర్ తెలుసునన్నావు, అతని పేరు, యిల్లు తెలుసా?"

"థాంక్స్" అని కాత్యా అక్కడ్నించి బయలుదేరింది.

జార్జిటవున్‌లో సిటీ లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఆఫీసు కనుక్కోవడం కష్టంకాలేదు కాత్యాకి.

"లక్ష్మీ లారీ సర్వీసు అడ్రసు" కాత్యా వాక్యం పూర్తిచెయ్యకుండానే.

"ఆదియప్ప నాయకన్ వీధి. నెంబర్ 579/2" అన్నాడు అక్కడ వున్న గుమాస్తా.

ఒక చిన్న గది, ఒక గుమాస్తా, ఒక బల్ల, బయట లక్ష్మీ లారీ సర్వీస్ అని బోర్డు "లారీ డ్రయివర్ రామచంద్రన్ వున్నాడా?" అడిగింది కాత్యా.

"మీకు లారీ కావాలా?"

"లారీ కాదు, డ్రయివర్ రామచంద్రన్ -"

"ఎందుకు?"

"పనున్నది" అంటూ యాభయి రూపాయల నోటు అందించింది.

"ట్రిప్ మీద వెళ్ళాడు యీ రోజు పొద్దున్నే, నేలంకి. రేపు పొద్దున్న వస్తాడు."

"ఇల్లెక్కడ?" అడిగింది.

"క్షణం ఆగండి అడ్రసు వ్రాసి యిస్తాను. మూల గ్రామణి వీధి. నెం.172....చూలై" అని కాయితం మీద వ్రాసి యిచ్చాడు.

"థాంక్స్" అన్నది కాత్యా. రేపటివరకూ కాచుకోవాలి. అంతే.

## 16

"రండి" అన్నాడు జైలు సూపరింటెండెంట్.

"థాంక్యు. శిఖామణి అనే అతను మీ జైలులో వున్నాడు. అతన్ని ఒకసారి కలుసుకోవాలి"

"ఓ! ఐయామ్ సారీ. అతను జుడిషియల్ కస్టడీలో వున్నాడు. అనుమతి లేనిదే కలుసుకోనివ్వలేను."

"శిఖామణికి అభ్యంతరం లేకపోతే, మీరు నన్ను కలుసుకోనివ్వవచ్చు. కోర్టు అభ్యంతరం చెప్పదు."

"సారీ. ఐ కాంట్ టేక్ ది రిస్క్ -"

"శిఖామణిని డిఫెండ్ చేసేందుకు అడ్వకేటుని యేర్పాటు చేసుకున్నాడా?"

"అలాటి యేర్పాటు చేసినట్టు నాకు తెలియదు. శిఖామణిని కలుసుకోవాలంటే, మీరు కోర్టు వారి నుంచి అనుమతి తెచ్చుకోవాలి" అన్నాడు జైలు సూపరింటెండెంటు.

"థాంక్ యు ఒన్స్ అగెయిన్" అని యుగంధర్ జైలునించి బయలుదేరాడు.

శిఖామణి కేసు ముందు కమిటల్ కోర్టుకి రావాలి. అంటే చీఫ్ మేజిస్ట్రేటు ముందు హాజరుపరచాలి. మేజిస్ట్రేటు కోర్టు కాలెండర్ చూస్తే ఎప్పుడు అతని కేసు విచారణకి వచ్చేదీ తెలిసిపోతుంది. యుగంధర్ మేజిస్ట్రేట్ కోర్టుకి వెళ్ళాడు. పావుగంటలో తెలుసుకున్నాడు. ఇక నాలుగు రోజుల తర్వాత శిఖామణిని మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరుస్తారు. అంటే తను నాలుగు రోజులూ బొంబాయిలో వుండాలి. హోటల్‌కి చేరుకునేటప్పటికి సాయంకాలం అయిందికి. మద్రాసుకి ఫోన్ చేసి, అని అనుకుంటూండగా టెలిఫోన్ మోగింది.

"హల్లో యుగంధర్ స్పీకింగ్ -"

"గుడ్ యీవినింగ్, ఎక్కణ్ణుంచి, బొంబాయిలోనే వున్నారా?" అడిగాడు యుగంధర్.

"నో! ఢిల్లీ నించి ఫోన్ చేస్తున్నాను. మీతో అత్యవసరంగా మాట్లాడాలి. దయచేసి ఒకసారి వెంటనే ఢిల్లీ రావాలి."

"ఏమిటి అంత అవసరం, నాకు యీ వూళ్ళో పని వున్నది -"

"ఆల్ రైట్, మళ్ళీ రేపు వెళ్ళిపోవచ్చు. వెంటనే యింకో గంటన్నరలో ఢిల్లీకి ఫ్లయిట్ వుంది. మా డిపార్టుమెంటువారు టికెట్టు ఏర్పాటు చేస్తారు. మీరు వెంటనే ఏరోడ్రోంకి బయలుదేరి రండి"

యుగంధర్ అరక్షణం ఆలోచించి "సరే వస్తున్నాను" అన్నాడు.

## 17

"బండార్కర్ చెప్పండి" అడిగాడు యుగంధర్. స్పెషల్ బ్రాంచి ఆఫీసులో బండార్కర్ కూర్చున్న తరువాత, కాఫీ తాగుతూ.

"షీలా ముఖర్జీ హత్యకేసులో శిఖామణి ఆ హత్య చేశాడని, మాకంతా నమ్మకం కుదిరింది. అందువల్లే కేసు దాఖలు చెయ్యమన్నాము."

"మేమంతా అన్నారు. అసలు స్పెషల్ బ్రాంచికీ యీ హత్యకీ సంబంధం యేమిటి?" అడిగాడు యుగంధర్.

"షీలా ముఖర్జీ వింగ్ కమాండర్ ముఖర్జీ భార్య. కనుక హత్యకీ, విదేశ గూఢచారులకీ ఏమైనా సంబంధం వున్నదా అని మా డిపార్టుమెంట్ దర్యాప్తు చేశాము" అన్నాడు బండార్కర్.

"మేమందరమూ అన్నారు"

"ప్రారంభంలో బొంబాయిలో సిటీ క్రయిం బ్రాంచి దర్యాప్తు చేసి సి.బి.ఐకి ఒప్పగించారు. శిఖామణి మీద కేసు పటిష్టమైనదని సి.బి.ఐ డైరెక్టరు కూడా అంగీకరించారు. "

"ఇంకా" అడిగాడు యుగంధర్.

"యధాలాపంగా హోమ్ మినిస్టరీనికూడా సంప్రదించాము."

"మినిస్టరీ అంటే సెక్రటరీలా? మంత్రులా?" అడిగాడు యుగంధర్.

"కేంద్రమంత్రులే, డిఫెన్సు మంత్రీ, హోం మంత్రి కూడా సాక్ష్యాన్ని పరిశీలించి, కేసు పటిష్టమైనదని ఒప్పుకున్నారు" అన్నాడు బండార్కర్.

"వెరీగుడ్ ఇంతకీ నన్ను ఎందుకు ఢిల్లీకి రమ్మన్నారు?" అడిగాడు యుగంధర్.

"శిఖామణి భార్య రాధ మిమ్మల్ని కలుసుకున్నదనీ, ఆమె మాటలు నమ్మి మీరు శిఖామణి కేసులో జోక్యం కల్పించుకుంటున్నారనీ, మద్రాసు ఐ.జీ చెప్పారు. బొంబాయి ఐ.జి కూడా ఫోన్ చేశారు. దాదాపు కేసు పూర్తి అయినట్లే, కోర్టులో సాక్ష్యం దాఖలు చెయ్యడం, సెషన్స్‌కి పంపడం, తర్వాత శిక్ష. అంతే ఆ విషయం స్వయంగా చెపుదామని" నవ్వాడు బండార్కర్.

"మిస్టర్ బండార్కర్, ఒక సామాన్యమైన హత్యకేసు, ఈ కేసు నేను విచారణ చేస్తానంటే యిన్స్‌పెక్టర్ స్వరాజ్యరావు మొదలు, అందరూ నాకు వొద్దని సలహా యిచ్చేవారే. కమ్ ఆన్. అసలు విషయం ఏమిటి?" అడిగాడు నవ్వుతూ.

"అసలు విషయం ఏముంది - అంతే"

"ఈ విషయం చెప్పడానికి నన్ను ఢిల్లీ రమ్మన్నారా! టెలిఫోన్‌లోనే చెప్పి వుండవచ్చుగా"

"మీరు వినిపించుకోరని -"

"ప్రత్యక్షంగా చెపితే మాత్రం వినిపించుకుంటానని ఎందుకు అనుకున్నారు" అడిగాడు యుగంధర్.

బండార్కర్ యిబ్బందిగా చూశాడు. "నేను అనుకోలేదు. మీ విషయం నాకు తెలుసు కనుక ప్రయత్నించమన్నారు. ప్రయత్నించాను" అని టెలిఫోన్ తీస్తున్నాడు.

"ఎవరు ప్రయత్నించమన్నారూ?" అడిగాడు యుగంధర్.

"పై అధికారులు" అని "యుగంధర్ గారు శిఖామణి కేసు దర్యాప్తు మానుకోరట" అని చెప్పి "ఆ! సరే, వెంటనే యింకో అరగంటలో తీసుకుని వస్తాను" అని రిసీవర్ పెట్టేసి.

"యుగంధర్ నేను మీకు చాలాకాలంగా స్నేహితుణ్ణి. ఆప్తుణ్ణి. ఎన్నో సమయాలలో నా ప్రాణం కూడా కాపాడారు. మా డిపార్టుమెంటుకి ఎంతో సేవ చేశారు. దయచేసి మొండిపట్టు పట్టక..."

"ఐయామ్ సారీ మిస్టర్ బండార్కర్. రాధ నిజం చెపుతున్నదో, అబద్ధం చెపుతున్నదో త్వరలో తేలుతుంది. శిఖామణి హంతకుడో, కాడో కోర్టులో తేలాలి. ఈలోగా అందరూ కలిసి"

"మీతో నేను వాదించి ప్రయోజనం లేదు. రండి. వెళదాం"

"ఎక్కడికి?" అడిగాడు యుగంధర్.

"చెప్తానుగా."

అరగంట తర్వాత డిఫెన్సు మంత్రి గదిలో వున్నాడు డిటెక్టివ్ యుగంధర్. హోం మంత్రి, సెంట్రల్ సి.బి.ఐ డైరెక్టర్, బండార్కర్ కూడా గదిలో వున్నారు.

"యుగంధర్‌గారూ, మనదేశపు పోలీసులు మీదా, సి.బి.ఐ మీదా స్పెషల్ బ్రాంచి మీదా, మంత్రులమైన మామీదా మీకు విశ్వాసం లేదా?" అడిగాడు డిఫెన్సు మంత్రి.

"మీ అందరిమీదా విశ్వాసం లేకపోవడం అనే సమస్యకాదు. శిఖామణి హంతకుడు అయితే, అంతటి గట్టి సాక్ష్యం వుంటే, నేను కొంత దర్యాప్తు చేస్తే ప్రభుత్వానికి ప్రాసిక్యూషన్‌కీ వచ్చిన నష్టం యేమిటో చెప్పడంలేదు. నన్ను అడుగు అడుగునా యీ కేసులోంచి తప్పించడానికి ప్రయత్నిస్తున్నారు" అన్నాడు యుగంధర్.

డిఫెన్సు మంత్రి, హోం మంత్రి వైపు చూశాడు. "మిమ్మల్ని ఆటంకపరుస్తున్నారని ఎందుకు అనుకుంటున్నారు? ఒక సామాన్యమైన కేసులో మీరు జోక్యం కల్పించుకుని, నీచుడూ, దుర్మార్గుడూ ఘాతకుడూ అయిన శిఖామణి తరఫున దర్యాప్తు చేస్తే, మీకు దేశంలో వున్న గొప్ప పేరు పోతుందేమోనని మా భయం" అంటున్నాడు హోం మంత్రి.

యుగంధర్ నవ్వి, "క్షమించాలి, విచారణ అయిన తర్వాత శిఖామణిని కోర్టులో దోషిగా నిర్ణయించాలి. అంతవరకూ న్యాయశాస్త్రం ప్రకారం అతను నిర్దోషి" అన్నాడు.

డిఫెన్స్ మంత్రి దగ్గాడు. "యుగంధర్‌గారూ ఒక్కొక్కప్పుడు కారణాలు అన్నీ చెప్పడానికి అవకాశం వుండకపోవచ్చు. శిఖామణి గతం మీకు తెలుసు"

"గివ్ ది డాగ్ ఎ బాడ్ నేమ్ అండ్ హాంగ్ యిట్, అదా?" అడిగాడు యుగంధర్ కోపంగా.

"మీతో వాదించదలచుకోలేదు. ఈ కేసు జోలికి పోవద్దని మనవి చేస్తున్నాము."

"క్షమించాలి" అన్నాడు యుగంధర్.

"కారణం?" అడిగాడు హోం మంత్రి.

"రాధకి మాట యిచ్చాను. శిఖామణి నిర్దోషి అయితే విడిపిస్తాను. దోషి అయితే ప్రాసిక్యూషన్ నేను యింకా పటిష్టం చేస్తాను."

"మీ నిర్ణయం మార్చుకోరా?"

యుగంధర్ మార్చుకోనని తల విదిలించాడు.

"మీరు వెళ్ళవచ్చు" అన్నాడు హోం మంత్రి. యుగంధర్ మంత్రి గదిలోంచి బయటికి వెళ్ళిపోయాడు.

సి.బి.ఐ డైరెక్టర్ చిన్నగా దగ్గాడు. హోం మంత్రి అటు చూశాడు.

"యుగంధర్‌గార్ని ఆపలేము. డిఫెన్సు మంత్రిగారు మిస్టర్ జీరోకి చెపితే మంచిదనుకుంటాను" అన్నాడు.

బండార్కర్ మొహం పాలిపోయింది. "క్షమించాలి, దేశానికి ఎన్నిరకాల ఆపదలో -"

"ఎక్సయిట్ కాకండి. అంతకు తప్ప మార్గం లేదా?" అడిగాడు డిఫెన్సు మంత్రి.

"నాకు కనిపించటంలేదు" అన్నాడు సి.బి.ఐ డైరక్టర్.

"న్యాయం కాదు."

"మిస్టర్ బండార్కర్. మీ డిపార్టుమెంటుకి సంబంధించిన విషయం గాదు. అంతేగాక, యిక్కడ జరిగిన సంభాషణ బయటికి పొక్కకూడదు. అవును, అదే మార్గం" అంటూ డిఫెన్సు మంత్రి టెలిఫోన్ తీశాడు.

మర్నాడు పొద్దునగాని బొంబాయికి విమానం లేదు. మద్రాసుకి ఫోన్ చేశాడు. కరుప్పన్‌ని జైలులో కలుసుకోడానికి వెళుతున్నానని రాజు, మర్నాడు డ్రయివర్ రామచంద్రన్‌న్ని కలుసుకుని, డాక్టర్ పంకజరావు ఉనికి తెలుసుకుంటానని కాత్యా చెప్పారు. యుగంధర్ రాజుకి జరిగింది క్లుప్తంగా చెప్పాడు. బ్రీఫ్‌కేసు తప్ప యేమీ తెచ్చుకోలేదు. ఢిల్లీలో యుగంధర్‌కి చాలామంది స్నేహితులున్నారు. కానీ ఎక్కడికీ వెళ్ళాలనీ, ఎవర్నీ కలుసుకోవాలనీ అనిపించలేదు. కానీ చటుక్కున ఒక ఆలోచన తట్టింది. టెలిఫోన్ డైరక్టరీ తీశాడు. వింగ్ కమాండర్ ముఖర్జీ ఫోన్ నెంబరు కోసం వెతికాడు. దొరికింది. "హలో ముఖర్జీగారున్నారా?"

"ముఖర్జీ స్పీకింగ్."

"నా పేరు యుగంధర్ డిటెక్టివ్‌ని. మిమ్మల్ని ఒకసారి కలుసుకోవాలి."

"సారీ! నాకు టైం లేదు. మిమ్మల్ని కలుసుకోవలసిన అవసరం లేదు."

టెలిఫోన్ డిస్కనెట్ అయింది. విచిత్రం. అమర్యాదగా యెందుకు ప్రవర్తించాడో? బల్లమీద తిరుగు ప్రయాణానికి ఏర్ టిక్కెట్టున్నది. బండార్కర్ పంపించి ఉండాలి. భోజనం చేసి పడుకున్నాడు యుగంధర్.

చాందినీ చౌక్ ప్రాంతాల అది ఒక చిన్న పుస్తకాల కొట్టు. పాత పుస్తకాలు, కొత్త పుస్తకాలు, అమ్మకానికీ, అద్దెలకీ యిచ్చేకొట్టు. "ఇంటలిజెంట్ రీడింగ్ లైబ్రరీ" అని ఒక పాత బోర్డున్నది. ఆ కొట్లో అసిస్టెంట్, కుర్రాడు, ప్రొప్రయిటరు అంతా ఒకరే. బాగా పండు ముసలి. ఊదారంగు పాంటు, మరకల షర్టు, నల్లనికోటు, తెల్లని జుట్టు, వెండి ఫ్రేము కళ్ళద్దాలు. అతని పేరేమిటో కూడా ఎవరికీ తెలియదు. అందరూ తాతా అని పిలుస్తారు. ఆ చుట్టుపట్ల చాలామంది ఆ లైబ్రరీలో మెంబర్లు.

ఆ కొట్లో టెలిఫోన్ కూడా వుందని యెవరూ అనుకోరు. టెలిఫోన్ మోగగానే ఆ వృద్ధుడు ఒక షెల్ఫ్ వెనుకవున్న టెలిఫోన్ వద్దకు వెళ్ళాడు.

"హల్లో" అన్నాడు.

"లైన్ క్లియర్" అన్నాడా వృద్ధుడు.

"జాగ్రత్తగా వినండి. వీలయినంతవరకూ మనిషిని బందీ చెయ్యండి కొంతకాలం, అదీ కుదరకపోతే"

"యస్, అర్థమైంది, కుదరకపోతే జీరో"

"కరెక్టు, అంత సులభంగా దొరికే మనిషికాడు."

"నాకు తెలుసు, నేను ఒకసారి మాట్లాడనా?"

"మాట్లాడితే హెచ్చరిక యిచ్చినట్లవుతుంది. ప్రమాదం" వృద్ధుడు రిసీవర్ పెట్టేశాడు. ఆ టెలిఫోనుకి డయిల్ నెంబర్లు లేవు. సింగిల్ లైను. ఇంకో టెలిఫోను ఒక చిన్న చెక్కపెట్టెలో వుంది. అది తీశాడు. ఒక నెంబర్ తిప్పి.

"హల్లో!"

"యస్" అవతలనించి.

"ఐడెంటిఫికేషన్?" అడిగాడు వృద్ధుడు.

"మి.యి....1"

"జీరో హియర్. చెపుతున్న విషయాలు వ్రాసుకో. హోటల్ ఇంపీరియల్‌లో రూం నెంబర్ 118లో, మూడవ అంతస్థులో వుంది ఆ గది. డిటెక్టివ్ యుగంధర్ అనే మనిషి వున్నాడు వొంటిగా. నాకు తెలిసినంతవరకూ ఆయుధాలు యేమీ లేవు. మనిషి చాలా బలాఢ్యుడు, సులభంగా చిక్కడు. ఎంతమంది అవసరమైతే అంతమందిని తీసుకుని వెళ్ళి, యుగంధర్ని బందీ చెయ్యాలి. డిపో మూడులో అట్టేపెట్టండి. తర్వాత రిపోర్టు చెయ్యండి" అన్నాడు జీరో.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments